క్లుప్తంగా

12వ పీఆర్సీని ప్రకటించాలి

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని ప్రకటించి, ఐఆర్ 30 శాతం ఇవ్వాలని బీటీఏ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎస్వీఎస్ పాఠశాల ఆవరణలో బీటీఏ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల రమచంద్రయ్య అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జాతీయ ఉపాధ్యక్షుడు గుండ్లపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఉద్యోగులకు, పెన్షనర్లకు రావలసిన బకాయిలు డీఏ, పీఆర్సీ, పీఎఫ్, సరెండర్ లీవ్‌లను చెల్లించాలన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పీఆర్సీని, ఐఆర్‌ని విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో హోంగార్డు మృతి


సురేంద్రబాబు (ఫైల్)

పాకాల : స్థానిక అగ్రిమాపక కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు బి.సురేంద్రబాబు(32) గుండెపోటుతో మృతి చెందారు. సోమవారం అగ్నిమాపక కేంద్రంలో మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో విధుల్లో సురేంద్రబాబు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన సహోద్యోగులు హుటాహుటిన పాకాల పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని సురేంద్రబాబు స్వగ్రామం చిత్తూరు మండలం తాళంబేడుకు తరలించారు.

సమస్యల పరిష్కారానికే పోరాటాలు


మంగళం డిపో వద్ద నిరాహార దీక్ష చేస్తున్న ఆర్టీసీ ఎన్‌ఎంయూ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటాలు తప్పవని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు తెలిపారు. మంగళం డిపోకు చెందిన ఎన్ఎంయూ నేతలు సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన బీఎస్ బాబు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ జిల్లా ఉపాధ్యక్షుడు గుణశేఖర్, మంగళం డిపో అధ్యక్షుడు ఆర్ఎం రెడ్డి, డిపో చైర్మన్ ఎంఆర్ చంద్ర, డిపో కార్యదర్శి ఎంఎస్ నాయక్, డీబీ ప్రకాష్, ఎంఎస్ రెడ్డి, డీఎస్ వాసు, కేవీ రమణ, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వావిలాలకు నివాళి


గోపాలకృష్ణయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర చైతన్యదీప్తి, గ్రంథాల ఉద్యమానికి ఆద్యుడు, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వావిలాల గోపాలకృష్ణయ్యకు మంగళవారం ఘన నివాళులు అర్పించారు. ఈ మేరకు రాములవారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో వావిలాల 22వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

ప్రేమ పేరిట మోసం

తిరుపతి క్రైం: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసి మరో యువతిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధమైన యువకుడిపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని లక్ష్మీపురంలో నివాసం ఉంటున్న లక్ష్మి, గుంటూరు జిల్లాకు చెందిన వెంకటరత్నంతో ఓ ప్రైవేట్ కంపెనీలో ఇద్దరూ జాబ్ చేసే సమయంలో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త ఏడాది నుంచి ప్రేమగా మారింది. దీంతో వెంకటరత్నం పెళ్లి చేసుకుంటానని చెప్పి యువతిని నమ్మించాడు. ఇప్పుడు మరో అమ్మాయిని పెళ్లి చేసుకునేందుకు సిద్ధం కావడంతో బాధితురాలు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమెకు తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో అనాథనైన తనను వెంకటరత్నం మోసం చేశాడని పోలీసుల ముందు వాపోయింది. పోలీసులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

తిరుపతికి అన్యాయం చేశారు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు సక్రమంగా జీతాలు అందకపోవడం దారుణమని మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ చింతామోహన్ మంగళవారం ఎస్వీయూ పరిపాలనా భవనం ఎదుట ఆయన కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి పెద్దఎత్తున నిరసన తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నీలం సంజీవరెడ్డి తిరుపతికి అన్యాయం చేశారని, తిరుపతికి రావలసిన రాజధానిని రాకుండా అడ్డుకున్నారని, ఆయన మోసగాడని విమర్శించారు. ఎవరికైనా కోపం వస్తే తనపై విమర్శలు చేసుకోండన్నారు.

పాలకుల నిర్లక్ష్యం వల్లే రోగులకు అవస్థలు

తిరుపతి తుడా: నిరుపేదలు ఎక్కువగా వచ్చే రుయా ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రారంభించాలని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం రుయా ఆస్పత్రి ఆవరణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన రుయా సూపరింటెండెంట్ రవిప్రభును కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమ్మర్.. ఫ్రూట్స్ బెటర్



అగ్నిగుండంలా భానుడు భగభగమంటున్నాడు. ఈ ఎండల్లో మసాలా, స్పైసీ ఫుడ్ తినకపోవడమే మేలని వైద్యులు చెబుతున్నారు. వేడి నుంచి శరీరానికి కాస్త ఉపశమనం కలగాలంటే నీటి శాతం అధికంగా ఉండే సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవాలని సూచిస్తున్నారు. మజ్జిగ, నిమ్మరసం వంటివి మరింత మేలు చేకూరుస్తాయని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు జాగ్రత్తలు పాటించాలని కోరుతున్నారు.

- వేసవిలో పండ్లతోనే సురక్షితం
- నీటిశాతం అధికంగా ఉండే వాటిని తీసుకోవడం మంచిది
- సీజనల్ ఫ్రూట్స్, జ్యూస్‌లతో వేసవిలో ఉపశమనం
- కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు

తిరుపతి తుడా: జిల్లావ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నమోద అవుతుండడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. సాధారణంగా మే నెలలో సూర్యుడి ప్రతాపం అధికంగా ఉంటుంది. కానీ ఏప్రిల్ రెండవ వారం నుంచే భానుడు ప్రతాపం చూపడంతో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఎండలు మండుతుండడం, అనంతరం రాత్రి అంతా ఉక్కపోత, వడగాలుల దాడి అధికం కావడంతో దిక్కుతోచని స్థితిలో ప్రజలు విలవిల్లాడుతున్నారు. దీంతో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా నీటి శాతం అధికంగా ఉన్న పండ్లను సేవించాలని వైద్యులు సూచిస్తున్నారు.

మజ్జిగ ఉష్ణాన్ని తగ్గిస్తుంది

వేసవి ఉష్ణాన్ని తగ్గించడంలో మజ్జిగ బ్రహ్మాస్త్రంగా పనిచేస్తుంది. మజ్జిగను పటిక బెల్లంతో తీసుకుంటే పైత్యం తగ్గుతుంది. శొంఠి, పిప్పళ్లు, మిరియాల చూర్ణంతో కలిపి తీసుకుంటే కఫం తగ్గుతుంది. రోజూ మజ్జిగ ఎన్ని పర్యాయాలు తీసుకుంటే అంత మంచిదని వైద్య నిపుణులు, ఆయుర్వేద వైద్యులు అభిప్రాయపడుతున్నారు.

శరీరానికి మేలు చేసే ద్రాక్ష

సులువగా జీర్ణమయ్యే పండ్లలో ద్రాక్ష ప్రధానంగా చెప్పవచ్చు. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. జ్యూస్ రూపంలో తీసుకోవచ్చు. కిడ్నీలో రాళ్లను నిరోధిస్తుంది. అజీర్ణం, మలబద్ధకం, గొంతు ఇన్‌ఫెక్షన్‌ను తగ్గిస్తుంది. శరీరంలో కొవ్వు పెరగకుండా నియంత్రిస్తుంది. క్యాన్సర్‌తో పోరాడుతుంది. శక్తి వంతమైన యాంటీ యాక్సిడెంట్లు అధికంగా ఉంటాయి.

నీరు –	92 శాతం
కార్బొహైడ్రేడ్స్ –	7శాతం
క్యాల్షియం –	20మిల్లిగ్రాములు
సీ విటమిన్ –	30మిల్లిగ్రాములు

అమ్మలాంటి నిమ్మ...

వేసవిలో నిమ్మ శరీర ఉష్ణాన్ని తగ్గించడంలో కీలకంగా పనిచేస్తుంది. నిమ్మరసాన్ని ఉప్పు, సోడాతో తీసుకోవడంతో దాహాన్ని నియంత్రించవచ్చు. శరీరాన్ని కావలసి పూర్తిస్థాయి సీ విటమిన్ నిమ్మరసంలో లభిస్తుంది. దీంతో రోగనిరోధకశక్తి పెరుగుతుంది. గోరువెచ్చని నీటితో కాస్త నిమ్మరసం, తేనె కలుపుకుని సేవిస్తే శరీర బరువు తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

10గ్రాముల నిమ్మలో శక్తి –	29కిలోక్యాలరీలు
పిండిపదార్థాలు –	9.2గ్రాములు
కొవ్వు –	0.3గ్రాములు
విటమిన్ సీ –	53మిల్లీగ్రాములు
క్యాల్షియం –	326మిల్లీగ్రాములు

కొబ్బరినీటితో ఉపశమనం

వేసవిలో శరీరానికి అలసట, నీరసం, అధిక ఉష్ణోగ్రతలను త్వరగా తగ్గించడంలో కొబ్బరి నీరు ఎంతో ఉపయోగకరం. శరీరానికి అవసరమైన పోషకాలతో పాటు తక్షణ శక్తిని సమకూర్చడంలో కొబ్బరినీరు దివ్యౌషధంగా పనిచేస్తుంది. దీనికి కొలెస్ట్రాల్‌ను తగ్గించే గుణం ఉంది.

కొబ్బరినీటిలో క్యాలరీలు –	46 శాతం
పొటాషియం –	600 గ్రాములు
సోడియం –	2.52 మిల్లీగ్రాములు
విటమిన్ సీ –	5.8 మిల్లీగ్రాములు ఉంటాయి

పోషకాల గని పుచ్చకాయ..

పుచ్చకాయ అంటేనే పోషకాల గనిగా పిలుస్తారు. ఇందులో బీ విటమిన్, పీచుపదార్థం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. వీటితో శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభిస్తాయి. వడదెబ్బ నుంచి తక్షణ ఉపశమనం కలిగించే గుణాలు పుచ్చకాయలో ఉంటాయని వైద్యులు చెబుతారు.

నీరు –	95.2శాతం
ప్రొటీన్ –	0.3గ్రాములు
కొవ్వు –	0.2 గ్రాములు
క్యాల్షియం –	32మిల్లిగ్రాములు
ఐరన్ –	1.3గ్రాములు
శక్తి –	17కిలోక్యాలరీలు

ద్రవ పదార్థాలు మేలు..



వేసవిలో ఆరోగ్య సంరక్షణకు పండ్లు, ద్రవపదార్థాలు తీసుకోవాలి. వడదెబ్బ బారిన పడకుండా నీటిశాతం అధికంగా ఉండే సీజనల్ ఫ్రూట్స్ తీసుకోవడం మంచిది. మసాలా, మాంసాహారపు పదార్థాలకు దూరంగా ఉండాలి. మజ్జిగ, కొబ్బరి నీరు, ఫ్రూట్ జ్యూస్‌లు అధికంగా సేవించాలి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే పగటి సమయాలలో అవసరమైతే తప్ప బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా పిల్లలు, వృద్ధులు తేలికపాటి ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమం.

– డాక్టర్ హారిక, రుయా వైద్యులు, తిరుపతి

సీజనల్ ఫ్రూట్స్ మంచివి



వేసవి తాపానికి సీజనల్ ఫ్రూట్స్ ఎంతో ఉపయోగకరం. బయట దొరికే ప్యాకింగ్ పదార్థాలు, చిరుతిండ్లు, ఫాస్ట్ ఫుడ్స్ ఆహార పదార్థాలకు ప్రజలు వేసవిలో దూరంగా ఉండడం మంచిది. నీటి శాతం అధికంగా ఉండే పండ్లు తీసుకోవాలి. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న సమయంతో బయట తిరిగితే డీహైడ్రేషన్‌కు గురైయ్యే ప్రమాదం ఉంది. ఓఆర్ఎస్‌లు, పండ్ల జ్యూస్‌లు కచ్చితంగా తీసుకోవాలి. ఇబ్బంది అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ సాయిలేష్య, ప్రముఖ వైద్యులు, తిరుపతి

ప్రజల పక్షాన నిలబడదాం


మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

- ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదాం
- వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : ప్రతిపక్ష పార్టీగా ప్రజల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడదామని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి తెలిపారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద మంగళవారం పార్టీ ప్రచార విభాగం నగర అధ్యక్షుడు ఎస్‌వీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రచార విభాగం నగర కమిటీ నియామకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా వైఎస్సార్‌సీపీ, భూమన కుటుంబంపై విశ్వాసంతో పార్టీలో పని చేయడానికి ఇంత పెద్ద ఎత్తున యువత రావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ ప్రచార నగర కమిటీ చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భూమన అభినయ్‌రెడ్డిని యువత, పార్టీ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, డైరెక్టర్ కడపగుంట అమరనాథరెడ్డి, నాయకులు సాకం ప్రభాకర్, దొడ్డారెడ్డి మురళీరెడ్డి, వెంకటేష్, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ, దినేష్‌రాయల్, పార్టీ ముస్లీం మైనార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్‌ఖాసీంబాషా, షేక్ ఇమ్రాన్ బాషా, మద్దాలి శేఖర్, అనిల్‌రెడ్డి, సుబ్బు, యశోద పాల్గొన్నారు.

సూత్రధారులను వదిలేసి.. నలుగురినే విచారించి..

- నామమాత్రంగా ఉపాధి అక్రమాలపై విచారణ
- కేవలం నలుగురి కూలీలనే విచారించి వెళ్లిపోయిన అధికారులు
- రూ.5 లక్షలు స్వాహాపై ఆధారాలతో సహా గతంలోనే ఫిర్యాదు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అగరాల గ్రామస్తులు


ఉపాధి కూలీ చీరాలయ్యను విచారిస్తున్న ఏపీడీ రెడ్డెప్ప

చంద్రగిరి: లక్షలాది రూపాయల ఉపాధి నిధులను అక్రమంగా కాజేయడంపై నామమాత్రంగా విచారణ జరపడంతో ప్రజలు మండిపడుతున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి జరిగిన ఉపాధి హామీ పథకంలో మండలంలోని అగరాల పంచాయతీలో కూలీ పనులు చేయకనే, చేసినట్లుగా రికార్డులు సృష్టించి సుమారు రూ.5లక్షలు స్వాహా చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడు నెలల క్రితం చంద్రగిరిలో జరిగిన సామాజిక బహిరంగ సభలో అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి అన్ని ఆధారాలతో సహా పీడీకి ఫిర్యాదు చేశారు. పీడీ ఆదేశాల మేరకు మంగళవారం ఏపీడీ రెడ్డప్ప, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం అగరాలలో ఉపాధి అక్రమాలపై విచారణ చేపట్టారు.

కేవలం నలుగురినే విచారించి..!

ఉపాధి హామీ పథకం నిధులు పంచాయతీలోని సుమారు 36 మంది కూలీల ఖాతాల్లో నగదు జమైంది. అయితే ఏపీడీ, ఎంపీడీఓతో పాటు ఇతర అధికారులు కేవలం చీరాలయ్య, వరలక్ష్మి, లక్ష్మమ్మ, శంకరమ్మ అనే నలుగురు కూలీలను మాత్రమే విచారించారు. అయితే ఈ నలుగురు కూడా తాము పని చేయకపోయినప్పటికీ తమ అకౌంట్లలో డబ్బులు పడ్డాయని, ఆపై ఆ నగదును వారే తీసుకున్నారని అధికారులకు తెలిపారు. అలాంటప్పుడు ఆ నగదును తాము ఎందుకు చెల్లిస్తామని ప్రశ్నించారు.

నిందితులను కాపాడడానికేనా ?

ప్రభుత్వ నిధులను దోచేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి మండల అధికారి వరకు ప్రతి ఒక్కరి పాత్ర ఉందని సర్పంచ్ భాస్కర్ రెడ్డి ఆరోపించారు. రూ.5 లక్షల వరకు ప్రభుత్వ సొమ్మును దోచేశారని తాను ఆధారాలతో సహా అధికారులకు అందజేయడం జరిగిందన్నారు. అయితే అధికారులు మూడు నెలల తర్వాత వచ్చి కేవలం నలుగురిని విచారించి వెళ్లిపోవడం వెనుక అంతర్యం అర్థం కావడం లేదన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఏపీడీని కోరగా .. రాతపూర్వకంగా అర్జీ ఇస్తే అర్ధరాత్రి వరకు విచారణ చేస్తానని తెలిపారు. తీరా సర్పంచ్ అర్జీ ఇచ్చాక మరో వారం రోజుల తర్వాత వచ్చి విచారణ చేపడతామని వెళ్లిపోవడంపై ఉపాధి కూలీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అతివేగమే ప్రమాదానికి కారణం



కారును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

పాకాల : అతివేగంతో పాటు కునుకుపాటు వల్లే కంటైనర్‌ను వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో 5 గురు కర్ణాటక, తమిళనాడు వాసులు మృత్యువాత పడిన సంఘటన రాష్ట్ర ప్రజలకు తెలిసిందే. మరో ఇద్దరూ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సోమవారం తిరుమల దర్శనం అనంతరం శ్రీకాళహస్తి ముక్కంటీశ్వరున్ని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా మండల పరిధిలోని తోటపల్లి సమీపంలో పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది.

ఇప్పటికే చాలా ప్రమాదాలు

హైవేలోని తోటపల్లి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో జరిగిన ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. మలుపు వద్ద వేసిన స్పీడు బ్రేకర్లు చిన్నగా ఉన్నాయి. అయితే ఆ ప్రదేశంలోనే వేగాన్ని నియంత్రించేందుకు మందంగా స్పీడు బ్రేకర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని స్థానికులు చెబుతున్నారు. జిల్లా అధికారులు అంతా మరోసారి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి ఇకపై ఇలాంటి ప్రమాదాలు జరగడానికి అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వైభవంగా నడివీధి గంగమ్మ జాతర


నడివీధి గంగమ్మను దర్శించుకుంటున్న మేయర్ డాక్టర్ శిరీష దంపతులు

తిరుపతి కల్చరల్: నగరంలోని 27వ డివిజన్ పరిధిలోని మల్లయ్యగుంట కట్ట నడివీధి గంగమ్మ తల్లి జాతర ఉత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఏటా గ్రామ పెద్దల పర్యవేక్షణలో నడివీధి గంగమ్మ జాతర ఉత్సవం జరపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా నడివీధి గంగమ్మను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి హాస్పిటల్ అధినేత డాక్టర్ మునిశేఖర్ నడివీధి గంగమ్మకు మంగళవారం మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఏటా గంగజాతర మూడో వారం ముందు నడివీధి గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. నడివీధి గంగమ్మ ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

అపు'రూపం'



తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ తల్లి మంగళవారం పసుపుకొమ్ముల అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి అలంకరణకు తిరుపతికి చెందిన యాచంద్రారెడ్డి, నాగమహేష్, లక్ష్మణ స్వామి, టీడీ, శారదమ్మ, కొరిమి నళిని, చెన్నైకి చెందిన ప్రభు బాలాజీ దాతలుగా వ్యవహరించారు. ఆలయ ఈవో జయకుమార్ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

– తిరుపతి కల్చరల్

కలెక్టర్‌కు ఆహ్వానం


కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరకు విచ్చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను దేవదాయశాఖ జిల్లా అధికారి రామకృష్ణారెడ్డి ఆహ్వానించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఈమేరకు జాతర ఆహ్వాన పత్రికను అందించారు. జాతరకు భక్తుల రద్దీకి అనుగుణంగా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

మేళాను సద్వినియోగం చేసుకోండి


పత్రాలను పరిశీలిస్తున్న అదనపు కమిషనర్

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ మేళా కార్యక్రమం కొనసాగుతోందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి తెలిపారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశానుసారం ఈ నెల 5వ తేదీ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయంలో టీడీఆర్ బాండ్ల దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఇప్పటి వరకు మేళాలో సుమారు 200 దరఖాస్తులను పరిశీలించడం జరిగిందన్నారు. అర్హత ఉన్న వారికి టీడీఆర్ బాండ్లు ఇప్పటికే పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారి దరఖాస్తుల పరిశీలన, రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియను కొనసాగిస్తున్నామని చెప్పారు. సంబంధిత ప్రజలు తమ భూములకు సంబంధించిన పత్రాలను అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మే డే వేడుకలు రేపు

తిరుపతి తుడా: ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడేని తిరుపతి జిల్లాలో పెద్దఎత్తున ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా మహేంద్ర పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మే 1వ తేదీన కార్మిక దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం

తిరుపతి కల్చరల్: రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో మంగళవారం జతీష్ నృత్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో నృత్యం అంతర్భాగమై ఉందన్నారు. ఈ సందర్భంగా నృత్య గురువు శైలజారెడ్డితో పాటు నృత్య కళాకారులను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రంగస్థలి కళాకారులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఉదయం 9 గంటలకు అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం (పరకామణి)
- యశోదనగర్‌లోని వేమన విజ్ఞానకేంద్రంలో ఉదయం 8.30 గంటలకు శ్రీశ్రీ జయంతి సభ
- టీటీడీ పరిపాలనా భవనంలో టీటీడీ ఈఓతో టీటీడీ గోశాలలోని సమస్యలపై ఉదయం 11 గంటలకు రాష్ట్ర గోసేవా సంఘం ప్రతినిధులు, హిందూ సంఘాలు, సంస్థల ప్రతినిధుల సమావేశం
- మే డే ఉత్సవాల్లో భాగంగా యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి నృత్యాలు, పాటల పోటీల నిర్వహణ
- కొర్లగుంట, మున్సిపల్ ఆఫీస్ పక్కన ఉన్న నడివీధి గంగమ్మ ఆలయంలో ఉదయం 10 గంటలకు శ్రీఅభయగణపతి, బాలసుబ్రమణ్య స్వామి వారి విశేష ప్రతిష్ఠాపన, నడివీధి గంగమ్మ శిఖర కుంభాభిషేకం.
- టీటీడీ పరిపాలన భవనం పాత క్యాంటీన్ ఎదురుగా సమావేశ మందిరంలో సాయంత్రం 5 గంటలకు టీటీడీ ఉద్యోగుల యూనియన్ నేత వి.రామచంద్రయాదవ్ పదవీ విరమణ సందర్భంగా అభినందన సభ
- అన్నమాచార్య కళామందిరంలో సాయంత్రం 5.30 గంటలకు తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి మంగళ శాసనాలతో భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ప్రారంభం, సాయంత్రం 6 గంటలకు సాహితీ సదస్సు, అనంతరం భక్తి సంగీత కార్యక్రమాలు

టీటీడీకి స్వీపర్ యంత్రం విరాళం


యంత్రాన్ని విరాళంగా అందజేస్తున్న దాతలు

తిరుమల: మల్టీ పర్పస్ క్లీనింగ్‌కు ఉపయోగించే రూ.25 లక్షలు విలువైన రైడ్ ఆన్ స్వీపర్ మెషీన్ మంగళవారం టీటీడీకి విరాళంగా అందింది. అధునాతన జర్మన్ టెక్నాలజీతో తయారు చేసిన ఈ యంత్రం బ్యాటరీతో పని చేస్తుంది. శ్రీవారి ఆలయం ముందు అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరికి రోస్సరి ప్రొఫెషనల్ కంపెనీకి చెందిన ప్రతినిధులు అందజేశారు.

తిరుమలలో వ్యక్తి మృతి


సురేష్‌గౌడ్ మృతదేహం

తిరుమల : తిరుమలలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ పోలీసులు కథనం మేరకు.. తెలంగాణలోని గద్వాల్‌కు చెందిన సురేష్ గౌడ్(40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో కుటుంబసభ్యులకు తెలియకుండా తిరుమలకు వచ్చేశాడు. అతడి కోసం కుటుంబసభ్యులు గాలిస్తున్నారు. మంగళవారం తిరుమల సీఆర్ఓ ఆఫీసు సమీపంలోని మరుగుదొడ్డికి వెళ్లిన సురేష్ గౌడ్ అక్కడే మరణించాడు. టీటీడీ భద్రతా సిబ్బంది మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకులకు పోలీసులు సమాచారం అందించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 65,904 మంది స్వామివారిని దర్శించుకోగా 24,487 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.53 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా, లేనివారికి 8 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.